# ప్రబోధ 6

మాటచెప్పినట్టు మనుజుండు నడచిన
మాటయిచ్చినట్టు మనుజుండు నడచిన
మనిషి కాదు వాడు మహితుడగును
మాట చెప్పినట్టు మనిషి నడువడేని
మనిషి కాడు వాడు మృగమె కాని.

మానవుని యొక్క పవిత్రత, మానవుని యొక్క కీర్తిమర్యాదలు, మానవుని యొక్క ఉన్నతస్థితి మాటపై ఆధారపడివున్నది. మాటనే మానవునకు ప్రాణము. మాటను తప్పినా ప్రాణమును పోగొట్టుకున్నట్టే. ఈ మానవుని యొక్క మాటలకు ఖర్చులేదు గాని విలువ ఎక్కువ. ఇలాంటి విలువైన మాటను మానవుడు నిలుపుకున్నప్పుడే మానవత్వాన్ని సార్థకము గావించుకున్నవాడౌతాడు. తన మాటను తాను పోషించుకునే నిమిత్తమై జీవితమునే త్యాగము చేసి దివ్యత్వమును అనుభవించి పవిత్రమును ప్రచారము గావించినవాడే యీ తులసీదాసు.

ఇతను ఆత్మారామ్ దుబె, తులసి అనే దంపతులకు జన్మించాడు. ఇతను 1554 విక్రమశకములో పుట్టాడు. క్రీస్తుశకము 1493 సంవత్సరము శ్రావణ మాసము శుక్ల సప్తమి రోజు జన్మించాడు. సాధారణముగా బిడ్డలు పుట్టిన తక్షణమే ఏడ్వటం ప్రారంభిస్తారు. కారణమేమనగా దీనికి రెండు విధములైన అర్థములున్నవి. ఆధ్యాత్మికముగా

తల్లిగర్భమునుండి జన్మించినంతనె కెవ్వుకెవ్వు ఏడ్చెదరు నవ్వకుండ
ఏడ్పుటేలకో తెలిసినది మీకు దినదినంబును గడచెడితెరగు చూడ

మన జీవితములో భవిష్యత్తు గురించి, జీవితము యొక్క బాధ్యతలను గురించి, జీవితవు యొక్క కర్తవ్యమును నిర్వర్తించుకునే క్రియ గురించి మానవుడు పుట్టినప్పుడు పరిశుద్ధుడై వుండటం చేత అతనికి వన్నియు కూడను అద్దములో కనిపించినట్టుగా వుంటుంటాయి. జీవితమనేది కేవలము ఆటపాటలతో ఆనందముగా గడపటం కానేరదు. అనేక సమస్యలతో కూడినది జీవితము. కష్టములు, నష్టములు, లాభములు, నిందలు, నిష్ఠూరములు యిలాంటి పుష్పముల చేత కట్టబడిన హారమే మానవ జీవితము. కనుక జీవితమనేది సామాన్యమైనది కాదని, భవిష్యత్తు

116028602

నందు అనేక బాధలకు గురికావలసి వస్తుందని తాను గుర్తించి యీపుట్టిన బిడ్డ అప్పటి కష్టుడే రాబోయే బాధలను చూసి యేడుస్తాడు.

ఇంక లౌకికమైన జీవితములో దీని అర్థము వేరుగా వుంటుంది తల్లి గర్భమున వున్నప్పుడు బిడ్డకు తనశ్వాస, తన ఆహారము తల్లి ద్వారానే అందుకుంటాడు. పుట్టిన తక్షణమే తల్లి ప్రేగునకు తనకు సంబంధమును విడదీస్తారు ప్రకృతి జనులు. కనుక తన ఉఛ్వాస నిశ్వాసములు ఆడటంకూడను కొంచెం కష్టతరమవుతుంది. ఈ రెండు లేనప్పుడు యీరక్తము యొక్కసరఫరా సరైన రీతిగా వుండదు. కనుక బిడ్డ ఏడ్చినప్పుడు ఆ ఏడుపుతో, ఆశ్వాసవల్ల యీనవరంధ్రములుకూడను తెరుచుకుంటాయి. తన ముఖము, నోరుయందు కూడను యనేక విధములైన జలము నిండి వుంటాది. ఈ ఏడ్పువల్ల తనయొక్క ఉఛ్వాస నిశ్వాసములు సక్రమముగా జరుగుతాయి. అప్పుడు blood circulation కూడా సక్రమముగా జరుగుతుంది. ఈ ఏడ్పునిమిత్తమై పుట్టిన తక్షణామే యేడ్వని పిల్లలను నర్సులు కాళ్లు చేతిలో పట్టుకొని తలక్రిందుకు విడచి బాగా కొడతారు. తద్వారా సామాన్యమైన ఉఛ్వాస నిశ్వాసములు ప్రారంభమవుతాయి. కాని యీతులసిదాసు నను పుట్టిన తక్షణామే ఏడ్వలేదు.

ఇతనిస్వరూపమును చూచినప్పుడు యేదో సమాధినిష్ఠలో వుండినట్లుగా గుర్తించారు యీయొక్క చుట్టూ వుండిన స్త్రీలు. ఈ విధమైన పుట్టుకరావటంచేత చుట్టుప్రక్కల ప్రజలు, కొంత మంది స్త్రీలు గుసగుసలు ప్రారంభించారు. ఈ బిడ్డ పుట్టిన నక్షత్రము మంచిది కాదని, జన్మము సరైనది కాదని యనేకవిధములుగా కూడను మాట్లాడుతూ వచ్చారు. దానికి తగినట్లుగానే కొన్ని లౌకికమైన అశుభములు ప్రారంభమైనాయి. నాల్గవ దినమే తల్లికి తీవ్రమైన జ్వరము వచ్చింది. సప్తమిరోజు తులసిదాసు జన్మించాడు. ఏకాదశిరోజు అనగా నాల్గవదినమే తులసి మరణించింది. కాని మూడు దినములు మాత్రమే మధ్యలో పాపం. తల్లి మరణించిన తక్షణామే యీపిల్లవాడు అనుకున్నట్లుగా కొన్ని అశుభలక్షణములతో జన్మించాడని, తల్లి మరణమునకు కారణుడైనాడని తండ్రి మనసుకు కొంత కష్టం కలిగింది. ఇంక ఆ చంటి బిడ్డను చూచుకొనేటందుకు ఆ యింటిలో ఎవ్వరూ లేరు. ప్రక్కింటిలోనే బిడ్డలు లేని ఒక అమ్మ వుంటుండేది. ఆమె పేరు ఛులియా. ఈమె యీ బిడ్డను చూచి 'అయ్యానేను సాకుకుంటానని ఆమె అడుక్కుంది పాపం. ఇతను ఆనందముగా ఆమెకు అందించాడు. ఆ ఛులియా యీ బిడ్డను యెంతో గారాబముగా సాకుకుంది పాపం. ఈమె కూడను ఐదవ సంవత్సరము వచ్చేటప్పటికి మరణించింది. ఇంక యీమెకు కూడను

116028603

వెనుక ఆధారము లేకపోవటము చేత చుట్టుప్రక్కలవారు యీబిడ్డను యెవరైనా సాకటానికి సరైన అవకాశము వుంటుందాదని అనుకొని విచారించగా ప్రక్కగ్రామములోపల రామశీల ఆశ్రమము వుండేది. ఆ రామశీల ఆశ్రమములోపల దానికి యజమానుడుగా నరహరిదాస్ అనే వ్యక్తి వుండేవాడు. ఈ నరహరిదాస్ యీపిల్లవానిని తీసుకొని పెంచుకుంటూ తన ఆశ్రమములో యనేక పనులు చెప్పుతూ విద్యలు గరిపిస్తూ వచ్చాడు. ఆ ఆశ్రమము లోపల ఒక తులసివనము వుండేది. ఇతను చదువుకున్నంతసేపు చదువుకోటము యీ తులసివనమునకు పోయి నీరుపోయటము, ఎండిన కొమ్మలు విరిచివేయటము యీ విధమైన సేవలు చేస్తూవచ్చేవాడు. ఆశ్రమానికి చేరిన తక్షణమే యీ బిడ్డకు కొత్తగా పేరుపెట్టాడు యీ నరహరిదాసు. ఆ పేరు రాంభోలా. ఇది పెట్టిన పేరు. కాని రాంభోలా అనేది నరహరిదాసుకు యింకా దగ్గర వున్నటువంటి వారికి మాత్రమే తెలుసు కాని మిగతా వారెవ్వరికి తెలియదు. కాని యితనికి కాలము చిక్కినప్పుడంతా కూడను, ఒక నిముషము అవకాశము చిక్కినా తులసివనములో పోయేది సేవలు చేస్తూ వుండేవాడు. సామాన్యముగా యేపని చేస్తూ వుంటారో ఆ పేరును పెట్టి పిలచటం కొంతవరకు లోకము యొక్క వాడుక. ఆనాటినుండి సర్వసామాన్యముగా ఆశ్రమానికి వచ్చేవారు, ఆశ్రమంలో స్థిరనివాసులైనవారు, యితనిని తులసిదాస్ తులసిదాస్ అని పిలుస్తూ వచ్చారు. తులసికి సేవ చేస్తున్నాడు కనుక యితని పేరు తులసిదాస్ అన్నారు. ఈ విధంగా పెరుగుతూ పెరుగుతూ వచ్చాడు.

క్రమక్రమేణా రాములపైన పాటలు వ్రాయటం, తాను పాడటము, యీ విధమైన చర్యలు దినదినాభివృద్ధి గాంచినాయి. పూవుపుట్టిన తక్షణమే వాసన వెదజల్లుతుంది. ఆ విధముగానే యీ తులసిదాసుయొక్క ప్రభావములు, భక్తిప్రపత్తులు దినదినాభివృద్ధి గాంచుతూ వచ్చాయి. అతనికి ఎవ్వరూ గురువులు లేకపోయినప్పటికిని, ఎవరి దగ్గర కూడను తాను అభ్యాసము చేయకపోయినప్పటికిని, పాటలు శ్రావ్యముగా పాడేవాడు. అతిమధురంగా వుండేవి. గురువు ద్వారా వచ్చిన విద్యలు కృత్రిమంగానే వుంటుంటాయి. సహజముగా వచ్చినటువంటివి కేవలము మధురంగా వుంటాయి. కనుక యీ మాధుర్యము తులసిదాసులో సహజంగానే పుష్పించింది. ఈ నరహరిదాసు చెప్పే రామాయణము యొక్క విషయాలంతా కూడను చక్కగా, చిత్తశుద్ధితో వినేవాడు. విన్న విషయములను తనయొక్క పదముల ద్వారా, తన యొక్క భావము ద్వారా, తనయొక్క మానసిక సంకల్పములచేతను చాలా పవిత్రమైన కావ్యంగా వ్రాస్తూ వచ్చాడు. అప్పుడప్పుడు యీ నరహరి కూడా చూసి

తనలో తాను సంతసించేవాడు. కానీ యీ తులసి దాస్ దగ్గర మెచ్చుకొనేవాడు కాదు. ఇది క్రమక్రమేణా కూడను ఒక వృక్షముగా మారుతూ వచ్చింది. ఇతని యొక్క పేరుప్రతిష్ఠలు నలు దిశలా కూడా వ్యాపించింది.

క్రమక్రమేణా యిరువది, యిరువదిఒక్క సంవత్సరముల ప్రాయి వచ్చింది. అదే గ్రామము లోపల ఉన్నతకులము వారు, బ్రాహ్మణులు యీ పిల్లవానికి తమ బిడ్డనిచ్చి పెండ్లి చేయాలని ప్రయత్నం చేశారు. ప్రారంభములోపల తులసి దాసు నాకు యీ వివాహము అక్కర లేదన్నాడు. ఇది సర్వసామాన్యముగా అలాంటి పిల్లలంతా చెప్పట ము సహజము. ఏ తల్లి తండ్రులు అడిగినా కూడను, ఏ గురువులు అడిగినా కూడను అబ్బే నాకు మేరేజ్ యిష్టం లేదని చెప్పటం ఒక ఫాషన్ అయిపోయింది. ఇది ఆనాడే ప్రారంభ మైంది. అనగా 400 సంవత్సరములకు పూర్వము. కాని నరహరి దాసు యొక్క ప్రోత్సాహము చేతనో, అతని ప్రోద్బలము చేతను కడపటికి అంగీకరించాడు. ఒక శుభ ముహూర్తము లోపల ఆ బిడ్డనిచ్చి వివాహము జరిగింది. కానియిక్కడ కొన్ని సన్నివేశాలు చెప్పక తప్పదు. అవి చెప్పినప్పుడే భవిష్యత్తు యొక్క విలువ చక్కగా అర్థమవుతుంది పిల్లలకు.

పెండ్లి అయ్యేంతవరకు పెండ్లి యిష్టము లేదని చెప్పిన తులసి దాసు పెండ్లి అయినమరుక్షణము నుండి భార్యను ఒక్కక్షణమైనా విడచిపెట్టి వుండే వాడు కాదు. ఆమె లేకుండా నీళ్ళైనా త్రాగేవాడు కాదు. అన్నిపనులు కూడను మానుకొనేవా డు. ఆమెను తినుటకు వదిలేవాడు కాదు. తాను తినుటకు పోయేవాడు కాదు. ఈ విధ మైన హిస్టీరియా ప్రారంభమైంది. పెండ్లి అయిన తరువాత, వీరింటికి వచ్చిన తరువాత ఒక సంవత్సరము గడచినప్పటికిని, వూరిలో వుండినప్పటికిని తన పుట్టిన యింటికి పంపలేదు పాపం. రామ కథను పాడటంకాని, రామకథను వ్రాయటంగాని పూర్తిగా స్తంభించిపోయింది. ఈ భార్యకు చాలా విసుగు పుట్టింది పాపం. ఏదో ఒక సమయము చూచుకొని ఒక్క దినమైనా పుట్టినింటికి పోవాలని ఆశించింది పాపం. తప్పని సరిగా ఒకనాడు ప్రక్కగ్రామానికి పోవలసి వచ్చింది తులసి దాసుకు. ఆయన సాయం కాలము ప్రక్క గ్రామానికి పోయి రాత్రికి వస్తానని చెప్పేటప్పటికి యీ భార్య యిదే సమయమని చూచింది. తాను ప్రక్కింటి వారితో చెప్పి తన సోదరునితో చేరి తన పుట్టినింటికి వెళ్ళిపోయింది. ఆనాటి స్త్రీలు ఒంటరిగా బజార్లో తిరగటం యేమాత్రము అలవాటు లేదు. కనుక సోదరుని ద్వారా తన పుట్టినింటికి చేరుకుంది. రాత్రి కొంచెము సమయము గడచిపోయింది. ఆ సమయానికి తిరిగి తులసిదాసు యిల్లు చేరుకున్నాడు. కుండపోతగా వర్షము కురుస్తున్నాది. మెరుపులు మెరుస్తున్నాయి. భయం

కరమైన ఉరుములు ఉరుముతున్నాయి. ఇంటికి రావాలంటె తులసిదాసుకు చాలా ఆనందము ఎప్పుడు ఎప్పుడు భార్యను చూడాలని ఆవేశముతో వున్నాడు. ఇంటికి వచ్చేటప్పటికి తాళము వేసివుంది. ప్రక్కింటామె చెప్పింది. అయ్యా ఆమె పుట్టినింటికి వెళ్ళిందని. అప్పటికే పదిగంటలు మించిపోయింది. పల్లెలలో ఆకాలములో ఏడుగంటలకే భుజించి నిద్రించేవారు. పది పదకొండు గంటలంటె యిది ఒక అర్ధరాత్రివేళని తలంచేవారు. ఈనాడు పది, పదకొండు, పన్నెండు గంటలంతా కూడను ఒక డిన్నరు టైమని భావిస్తున్నారు. ఈ వర్షమును, వురుములను, మెరుపులను లెక్కచేయకుండా నడచుకుంటూ తిరిగి అత్తవారింటికి వెళ్లాడు. ఆ తృతతో తలుపును కొంచెం గట్టిగా కొట్టాడు. ఈ భార్యకు తెలుసును. యీ పిచ్చిమనిషి ఎప్పుడైనా రావచ్చని భావించుకొంది. అమ్మను తలుపు దగ్గరకు పంపకుండా తానే వెళ్లి తలుపు తీసింది. చూసేటప్పటికి వళ్లంతా నీరుకారిపోతుంటాది. బయట కుంభవర్షము కురుస్తున్నాది. మించు మించినప్పుడు యితని ముఖము కనుపించింది. భార్యకు పట్టలేని కోపము పుట్టిపడింది. ఆమెకు నిద్రాభంగము కావటంచేతను, యితని చర్యలు సక్రమమైన మార్గములో లేవని తెలుసుకోటం చేతను ఆమెకు మరింత కోపం వచ్చింది. ఆమె నోరు విప్పి గట్టిగా 'కామాంధుడా! యీ చిమ్మ చీకటి లోపల యీ వర్షము నందు ఒక్కదినమైనా నీవు ఓపిక పట్టుకోలేపోయావా. యీ మల మూత్ర దుర్గంధ మాంస రక్తములతో కూడిన యీ దేహముపైనున్న మోహము అణుమాత్రమైనా కూడను ఆ రాములపై వుండివుంటె ఎంత నీవు ధన్యుడవై వుండేవాడవో అని ఆమె చివాట్లు పెట్టింది. అణుమాత్రము పెట్టకూడదా రాములపైన. ఇదేనా మానవుని యొక్క విలువ. ఇదేనా గృహస్థ ధర్మము యొక్క చర్య". ఈ విధమైన సూటైన మాటలు అతని హృదయానికి నాటుకొని పోయాయి. ఇంక నిలవలేదు. క్షణము లోపల మారిపోయింది మనసు. భార్యను గురువుగా భావించుకున్నాడు. తక్షణమే వెనుకకు తిరిగాడు. ఈ రాత్రిలోపల తిరిగి చిమ్మచీకటిలో, యీ కుంభవర్షములో యింక యేమాత్రము జీవితము మీద ఆశలేకుండా ప్రయాగ చేరుకున్నాడు.

ఈ ప్రయాగలో కాలము గడుపుకొన్నాడు. నిజమే నా జీవితమంతా మానవత్వమని పిలిపించుకొని కుక్కల నక్కల వలె నేను జీవించటానికి ప్రయత్నించాను. నా జీవితమనేది కేవలము యీ యొక్క సుఖము కోసమా వచ్చింది. కాదు కాదు. నా భార్య చెప్పిన వాక్యము మహా పవిత్రమైన వాక్యము. ఆమెయందే శ్రీరాములు ప్రవేశించి నాకీ విధమైన వుపదేశము చేయించాడని తలంచాడు. నేను

116028606

యదిఆశించాన్ అవన్నీ కూడను నాకంటె యెదురుగానే అనేక జంతువులు, మృగములు గాడిదలు, కుక్కలు, కోతులు, నక్కలు అన్నికూడను అనుభవిస్తున్నాయి. నేను కూడను దానితో సమానమా లేక నేను ప్రత్యేకమైన మానవత్వము విశిష్టలో వుంటున్నాదా అని తను తనలో తాను విచారించుకుంటూ వచ్చాడు. ఇక రెండవదినము నుండి తాను రామ గానము ప్రారంభించాడు. కొన్ని ఆశ్రమాల వారితో స్నేహముగా వుంచుకున్నాడు. కొన్ని కాగితాలపైన, కొన్ని ఆకులపైన కూడను రామకథామానసము అనే చరిత్రను ప్రారంభించాడు. ఇదే తులసిదాసు రామాయణము. ఇది కావ్యరూపములో లిఖిస్తూ వచ్చాడు. తదుపరి యేకాంతమైన ప్రదేశములో కూర్చొని తన రాముని యొక్క దివ్యత్వాన్ని సౌందర్యమును, ఆశయాలను తన మనస్సులో చిత్రించుకుంటూ ఒక విన్నపము అనగా ఒక అర్జీ అనే దానిలో 326 శ్లోకములు ప్రారంభించాడు.

ఇంక యీ ప్రదేశములో వుంటే జనసమూహము అధికముగా వుంటున్నది కనుక నాకు యీ రామకథను రచించే నిమిత్తము యేకాంతవాసము కావాలనుకున్నాడు. అక్కడ నుండి చిత్రకూటమునకు ప్రయాణమై వెళ్లాడు. ఈ చిత్రకూటమనేది ఉత్తర ప్రదేశమునకు మధ్యప్రదేశమునకు మధ్యన వుంటున్నది యీ పర్వతము. అర్ధము ఉత్తరప్రదేశములో వుంది. అర్ధము మధ్యప్రదేశ్‌లో వుంటున్నది. ఇది బందా అనే జిల్లాలో చేరినది. యిక్కడ ప్రవేశించాడు. ప్రవేశించి నిత్యము రామకథ ప్రారంభించాడు. ఈ నరహరిదాసు చెప్పే రామాయణము నందుండే విషయాలంతా తనలో తాను హృదయములో చిత్రింప చేసుకొని దానినే స్మరించుకుంటూ దానిని ఆధారము చేసుకొని కొన్ని కొన్ని పాటలు రాస్తూ వచ్చాడు.

ఒకనాడు రామపూజ నిమిత్తమై గంధము తీస్తూ రామచింతన చేస్తూ వుండినాడు చిత్రకూట పర్వతము మీద తులసిదాసు. ఇద్దరు చిన్నపిల్లలు అక్కడ ప్రవేశించి 'తాతయ్యా! తాతయ్యా! మాకు యీ గంధము యిస్తావా' అన్నారు. ఈ తులసిదాసుకు చాలా మడుగు. ఎవరు కూడను Touch చేయకూడదు. తాను పరిశుద్ధముగా వుండుండాలి. భావాలు కూడ పరిశుద్ధమైనవి రావాలి. కారణమేమంటే ఆ కాలములో ఒకరికొకరు Touch చేసుకోటంవల్ల వారి మాలిన్యము వీరికి వీరి మాలిన్యము వారికి చేరుతూ వుండేది. దేహసంబంధమైన మాలిన్యము లేకాదు. భావసంబంధమైన మాలిన్యములు కూడను చేరటానికి అవకాశము వుంటుండేది. పవిత్రమైన మహనీయులను, పవిత్రమైన గురువులను, పవిత్రమైన వ్యక్తులను తాకటము కోసమే నమస్కారములని ప్రారంభించారు. అపవిత్రమైనవారును, కొన్నివిధములైన అసభ్యమైనవారును, అశీలమైనవారును

మనలను తాకినప్పుడు వారియొక్క సంపత్తు మనకు లభిస్తుందని ఆనాటి విశ్వాసము. మనిషిలో ఒక విధమైన కరెంటు వుంటున్నది. ఏ విధముగా మన యిండ్లకు కరెంటు వేసినప్పుడు దానికి shock కొట్టకుండా earth అని ఒక వైరు వేస్తుంటాము క్రిందికి. అదే విధముగా మన దేహములో కరెంటు వుండటంచేత యీ భూమినుంచి దీనియొక్క shock వస్తుందేమోనని ఒక board వేసుకొని దానిపైన ఒక వస్త్రము వేసుకొని ఒక చర్మము వేసుకొని కూర్చోటానికి మూలకారణము అది. ఈ కరెంటు సంగతి అందరికి అర్థము కాదు. ఆధ్యాత్మిక మార్గములో ప్రయాణము చేసే వ్యక్తులకు యిది చక్కగా అర్థమౌతుంది. ఈ కరెంటులో ఒక విధమైన గుణము వుంటున్నది. అది మీకందరకు తెలుసు. ఒక వైరు ఎవరన్నా పట్టుకుంటే అతన్నింక లక్షమంది పట్టుకొనిన లక్షమందికి shock కొట్టేస్తుంది. అదే విధముగానే మంచిగాని చెడ్డగాని ఒకరికొకరు చేరటంచేత అవి యిద్దరిలోనూ ప్రవేశిస్తూ వుంటాయి. ఈ కాలములో ధ్యానసమయములోపల ఒకరితో ఒకరు సంబంధము లేకుండా, ఒకరికొకరు తాకకుండా కూర్చోటానికి ప్రయత్నం చేస్తూ వుంటారు. ఒకరికొకరు చేరుకొని కూర్చున్నవారికి meditation లో యీ జన్మమునకు నూరు జన్మములకు వారికి concentration కుదరదు. ఇది శాస్త్రసమ్మతము, అనుభవము యొక్క లక్ష్యము. కాని యీనాటి పిల్లలు దానిని విశ్వసించరు. కనుకనే ఎంత కాలము చేసినప్పటికిని వున్నస్థానమునందే వుంటున్నాము. ఆలక్ష్యాన్ని మనసునందుంచుకొని యీపిల్లలు యీగంధమును తాకుతారేమో, నన్ను తాకుతారేయేమోనని వాళ్ళవైపునే చూచుకోకుండా రామగానమును చేస్తూ యీగంధమును తీస్తున్నాడు తులసీదాసు. ఇంతలోనే ఆచెట్టుపైనున్న పక్షి పలికిందట 'అయ్యో! తులసీదాసు యీవచ్చిన పిల్లలు రామలక్ష్మణులు జాగ్రత్తగా మాట్లాడు' అందట. ఇది మొట్టమొదటి అనుభవము తులసీదాసుకు. ఆపలికిన చిలుకనే హనుమంతుడు. కాని యింక తులసిదాసు యందు కొంత మాలిన్యము వుండటంచేత, గడచిపోయిన యొక్క మాలిన్యము యింకా అప్పుడప్పుడు హృదయములో తొలుకు వేయుచుండటంచేతను యితనికి సాక్షాత్ రామలక్ష్మణులమాదిరి, హనుమంతులమాదిరి దర్శనము కలుగలేదు. పరిశుద్ధమైన అద్దము లోపల పరిశుద్ధమైన ప్రతిబింబమే వుంటుంది. మలినమైన అద్దములో మలినమైన ప్రతిబింబమే కనిపిస్తుంది. కనుక యితను పరమభక్తుడైనప్పటికిని యీగడచిపోయిన మాలిన్యము అతని మనస్సులో అప్పుడప్పుడు తొలుకు వేస్తుంటున్నది. కనుక అపరోక్షంగా కూడను అనగా యివ్వవలసిన దర్శనము కొంతవరకు మార్పుగా కనుపించింది యితనికి. ఇంతలో తాను ఆలో

చేస్తూ ఈ చిన్నపిల్లలు రామలక్ష్మణులా అనే సందేహము అతనికి కలిగిన తక్షణమే ఇరువురు కూడను ఆగ్రంథమును తీసారు. ఈ తులసిదాసు నొసలు రాసారు. అంతర్ధానమైపోయారు. దీని అంతరార్థమేమనగా అయ్యా! నీ పిచ్చి బుద్ధిలోపల యింతకు పూర్వము చేసిన దుర్గంధమంతా వుంటుండాది. ఇదుగో నేను యీ సుగంధమును రాస్తున్నాను. ఇక నేటినుండి నీ భావములంతా సుగంధముగా మారిపోవుగాక అనేదే దీనియొక్క అంతరార్థము.

ఇంక ప్రారంభించాడు అతని కవిత్వము. ఏది చెప్పిన అన్ని కూడను లఘు గణములలోపల కూడి వచ్చే పదములే. ఏ ఒక్క పదము కూడను రామునకు విరుద్ధముగా రాలేదు. ఇది దైవానుగ్రహము. దైవస్పర్శయొక్క ప్రభావము. దైవదర్శనము యొక్క ప్రతిబింబము. అందుకోసమనే దర్శనం పాపనాశనం. సంభాషణం సంకటనాశనం. స్పర్శనం కర్మవిమోచనం మూడు కూడను అయిపోయినాయి తులసిదాసుకు. ఇతను యించుమించు త్యాగరాజు మార్గమునే అనుసరిస్తూ వచ్చాడు. ఆ సుందరమైన దర్శనమును తన హృదయములో చిత్రించుకున్నాడు. మొట్టమొదట మనసునను బోధ చేయటానికి ప్రారంభించాడు.

శ్రీరామ చంద్ర కృపాళో భజమన - చరణా భవభయ దారుణం

ఈ భయంకరమైన సంసారమునుండి తరింపచేయుటకు ఆకరుణాస్వరూపుడైన ఆ రామచంద్రుని స్మరింపవా మనసా అని మనసునకు మొట్టమొదట బోధ ప్రారంభించాడు. ఆ రామచంద్రుని యొక్క స్వరూపాన్ని తల్లికిని, తండ్రికిని పోల్చుకుని చింతిస్తూ వచ్చాడు.

శ్రీరామ జయరామ శృంగార రామ యని చింతించరాదె ఓ మనసా
చింతించరాదే.
తళుకు చెక్కుల మోము ముద్దిడను కౌసల్య తపమేమి చేసెనో
ఆ కౌసల్య తపమేమి చేసెనో
శ్రీరామ రామ రారాయని ధశరథుడు శ్రీరామ రారాయని పిలువను
తపమేమి చేసెనో

ఈ విధముగా కూడను త్యాగరాజు, వారు ఎంత అదృష్టవంతులో, వారు యేతపము చేసిరో అని వారి తపస్సులనే చింతించుకుంటూ తాను కూడను తపస్సులోనే లీనమయ్యాడు.

ఒకనాడు తులసిదాసు రామచంద్రా నేను దీనుడను. నేను

116028609

హీనుడను. క్షీణించిన శరీరము కలవాడను. నేను అంగహీనుడను. నాకు సర్వాంగములు వుండి కూడను నేను అంగహీనుడని చెప్పుకొనుటలో నీవు కొంతవరకు నన్ను తమాషా చేయవచ్చు. నాకు వున్నాయి అంగములు. ఏమి ప్రయోజనము. నీ సేవకు కొరగాని హస్తములు వుండి కూడను లేనటువంటివే. కన్నులు వుంటున్నాయి. పత్రికాయలవలె వుంటున్నాయి. ప్రపంచాన్ని చూస్తున్నాయి. నిన్ను చూడలేక పోతున్నాయి. కనుక నా కన్నులు వుండి కూడను నేను గ్రుడ్డివాడనే. చెవులు వుంటున్నాయి రామచంద్రా. కొండలో వున్న గుహాల వలె వుంటున్నాయి. ఈ యిలు లోపల కుక్కలు, నక్కలు చేరేవేగాని పవిత్రమైనవి యిందులో యేమాత్రము చేరవు. నాకు నాలుక వుంటున్నది కప్పవలె. ఎప్పుడు చూచినా కప్ప నాలుక ఆడిస్తూ వుంటున్నదిగాని దేనికోసం. దాని స్వభావము. అంతే కాని నీనామము నాలుకపైన నాట్యమాడించటం లేదుకదా! అలాంటి నాలుక వుండి ఏమి ప్రయోజనము. కనుక నాకు సర్వాంగములు వుంటున్నాయి. కాని నీ సేవలో పాల్గొనటం లేదు. కనుక నేను అంగవిహీనుడనే! అన్నాడు. అదేవిధముగానే త్యాగరాజు కూడ చెప్పాడు కన్నులేలా రాముని చూడని కన్నులేలా!

ఈ విధమైన స్థాయిలోనే తులసిదాసు, యీ త్యాగరాజు యిరువురు ఒకే మార్గాన్ని అనుసరిస్తూ వచ్చారు. ఈ విధమైన వాటిలో తులసిదాసు మరింత ముందంజ వేస్తూ వచ్చాడు. నిజముగా మానవుడు తనలో వుండిన దోషములను గాని, తనలో వున్న బలహీనతలుగాని ఎవ్వరూ చెప్పుకోటం యిది సాధారణముగా వుండదు. కాని తులసిదాసు తనలో వున్న సర్వ బలహీనతలు కూడను భగవంతుని దగ్గర మొరపెట్టుకున్నాడు. నేను యిలాంటి పాపములు చేశాను. తెలిసి కూడను నేను అనేకవిధములైన దుర్మార్గములో పాల్గొన్నాను. ప్రతి జీవుని యందును నీవున్నావని తెలిసి కూడను, యితరులను నేను సంబంధ బాంధవ్యముగా నేను అనుభవించాను. కనుక యీ పాపములన్నిటిని నీవు క్షమించి నన్ను సరైన రీతిలో పరిశుద్ధునిగావించి నీలో చేర్చుకొమని ప్రార్థించాడు.

ఇంతేకాక రామచంద్రా! నీ విషయమును గుర్తించిన తర్వాత నాకే ప్రపంచము అక్కరలేదు. మందార పుష్పము నందున్న మకరందమును గ్రోలే తుమ్మెద ఉమ్మెత్త పూలపైకి ఉరుకులెత్తుతుందా? ఆకాశగంగలో సంచరించే రాజహంసలు మురికి కాలువలపైకి మోహము పోవునా? తియ్యని మామిడి పూతను లేత ఆకును భుజించి కమ్మని గానము చేసే కోయిలలు అడవి ముల్లెలపైన ఆశపడునా? ఇంతేకాదు. చెలగి మధువు గ్రోలు చేదురుచించునా? ముద్ద ఖర్జూరమును తినే వ్యక్తి చింతపండు

పైన ఆశ పడునా? నిజముగా నీ యొక్క ఆనందమును, నీయొక్క ప్రేమ తత్త్వమును, నీయొక్క హృదయానందమును అనుభవించిన వ్యక్తి మరొక దానిని యేమైనా ఆశించునా? కనుక నేను నీ ఆనందమును పూర్తి అనుభవించాను. నీ ప్రేమ రసామృతమును చక్కగా గ్రోలినాను. నీ మకరందములో నేను లీనమైనాను. ఈ ప్రపంచ దుర్గంధము నాకింక అక్కర లేదు. ఈ విధమైన రీతిగా తనలో వున్న ఆవేదననంతా కూడను రాముని ముందు త్రక్కుకున్నాడు.

దీనినే త్యాగరాజు మరొక రూపములో చెప్తూ వచ్చాడు. ఆయన యొక్క భావము కూడను యీ విధమైన రీతిగనే ప్రపంచమును త్యజించి, పరమాత్మని వరించి తను తరించే మార్గాన్ని అవలంబించాడు. నేను పరులను చూచి కొంతవరకు అసూయలో మునిగాను. ఇతరుల యొక్క కలిమిని చూచి నేను కుమిలిపోయాను. ఇవన్నీ కూడను దుర్గుణములని నాకు తెలియక పోలేదు. ఈ భావములను నీవు నిర్మూలము చేసి, నా హృదయాన్ని పరిశుద్ధము చేసి చక్కగా యిందులో ప్రవేశించు రామా! అని ప్రార్థిస్తూ వచ్చాడు. సాధకులందరూ కూడను తమ చిత్తశుద్ధి నిమిత్తమై సాధనలు గావించుకుంటూ వచ్చారు. శోధన సల్పుతూ వచ్చారు. నేనింక ఒక్క క్షణమైనా నిన్ను వదలి వుండలేను. కనుక నన్ను నీలో ఐక్యం గావించుకోమని ప్రార్థించుచున్నాడు యీ త్యాగరాజు.

నిను వినా నామదెందు నిలువదే శ్రీహరి

కనులకు నీ సొగసెంతో కలిగియున్నది కనుక ॥నిను విన॥

నిన్ను చూచిన కన్నులు మరియొక పదార్థమును చూడలేవు. నీ ఆనందమును అనుభవించిన జీవితము మరొక ఆనందమునే మాత్రము కూడను ఆశించదు. ఈ విధమైన అధారమైన భావములు తులసిదాసు హృదయమునందు పెట్టుకొని రామా! నేను అనర్హుడను. కాని ఒక్కదానియందు మాత్రము నేను అర్హుడను అన్నాడు. నీ దాసుడైన తులసికి నే దాసుడను. కనుకనే నాకు తులసిదాసు పేరు వచ్చింది. ఈ ఒక్కదానియందు మాత్రం నేను అర్హుడను. ఎందుకంటె తులసి సేవ హృదయపూర్వకముగా చేశాను. నీవు నన్ను దాసుడుగా స్వీకరించటం యిష్టం లేకపోతే దాసానుదాసుడుగానైనా స్వీకరించు అన్నాడు.

దాసాను దాసుడను కావలెనురా

నే నీ దాసులకు సేవనే చేయవలెరా.

కనుక తులసిదాసు యొక్క విషయములు చెప్పాలనుకుంటె కొన్ని సంవత్సరములు పడుతుంది. ఎంత చెప్పినా కూడను తరిగేదికాదిది. ఒరిగేదికాదిది. బయటనుంచి కూరేది కాదిది. హృదయమునుంచి ఊరేది. కనుక భగవంతుడు సకల సౌందర్యవంతుడనియు, అతనికంటె అందమైనది యీ జగత్తులో లేదనియు, అతని

సన్నిధికంటె మరొక పెన్నిధి యింక యీ జగత్తులో కన్పించదనియు, అతని ప్రేమకంటె మించిన ప్రేమ యింక యీ జగత్తులో కానరాదనియు, ప్రేమరసామృతమును గ్రోలిన మానవునకు ఏది కూడను రుచింపదనియు, ప్రపంచ సంబంధమైన యీ వాంఛలన్నియు క్షణభంగురమనియు యీ విడారు వాక్యములను తన హృదయమునందు భద్రము చేసుకొని దానిపైన యీ తులసిదాసు రామాయణమును అభివృద్ధిపరచుకుంటూ వచ్చాడు. కనుక తులసీదాసు రామాయణములో వుండే గంభీరత, పరమ భక్తిప్రపత్తులతో కూడినది.

రామచంద్రా! నీ యొక్క ఘనత యెవరూ కూడ వర్ణించలేరు. అన్నాడు. ఎవరు వర్ణింతురో వారే నీ ఘనత తెలియనివారు అన్నాడు. నీళ్లలో వుండి కూడను మనిషి మాట్లాడవచ్చును. పూర్తిగా మునిగినవాడు యే విధముగా మాట్లాడలేడో ఆవిధముగా నీ యొక్క మకరందాన్ని గ్రోలినవారు యిట్టిది అట్టిది అని ఎవరూ చెప్పలేరు. ఎవరు చెప్పగలరో వారు యీనీటిలో మునుగలేదని అర్థము. కనుక ఆనాటినుండి అతను ఒక్క మాటను నిలబెట్టుకున్నాడు. మాటనే మనిషికి ప్రాణము. ఈ మాటనే ఉన్నతస్థితికి కొనిపోతుంది. అధోగతికి దిగజారుస్తుంది. మాటవల్లనే మనిషికి స్నేహం కల్గింపజేస్తుంది. కాని ద్వేషాన్ని కూడను కల్గిస్తుంది. కానీ మనసు నందున్న సంస్కారాన్ని కూడను ఆధారము చేసుకుంటుంది యీ మాట. నాకు యీ దేహమునకు సంబంధించిన భార్య యిచ్చిన ఆదేశము వల్లనే రాముని పదసన్నిధికి చేరుకోగల్గాను. కనుక ఒక చెడ్డ మరొక మంచిని కూడను చేకూరుస్తుంది. మంచి కూడను రెండు చెడ్డలలో పలనే యిమిడి వుంటుంది. కనుకనే Pleasure is an interval between two pains అన్నారు. నిజముగా నా భార్య నన్ను నిందించెనే అనే అభిమాన మమకారములతో వుంటే నాకీ పవిత్రమైన సన్నిధి చిక్కి వుండేది కాదు. ఈ మమకార అహంకారములే మానవుని ముంచివేస్తుంటాయి. కనుక యీ మమత్వమనేది నీపైన వుంటున్నాది. నిజముగా అహంతత్వము నా ఆత్మపైన వుంటున్నాది. వుండవలసిన దానిపైన వుండకుండా, వుండరాని దానిపైన నీ మమత్వము, అహంతత్వాన్ని పెంచుకోటంచేతనే నీవు బంధితుడవవుతున్నావు. కనుక నన్ను యీ భవబంధములనుండి దాటించమని శ్రీరామచంద్ర కృపాళో అని రామచంద్రుని కృపాళునిగా పొల్చుకొని యీ భయంకరమైన భవబంధాన్ని దాటించమని కోరుకున్నాడు.

తులసి దాసు ఏక్షణమున ఆగృహమును వదలెనో ఆనాటినుండి తాను యీదేహమును చాలించేంతవరకు కూడను ఆగృహమును కాని, ఆసంబంధమును కాని దేనిని మనసు నందు ఒక్కక్షణమైన కూడను చింతించలేదు. అది తీవ్రవైరాగ్యము. ఏదో యేకాంతముగా మనం జీవించటం చేత మనము గొప్పదానిని అనుభవిస్తాము అనేది కేవలం ఒక బలహీనత. పవిత్రమైన వాతావరణమునందే, పవిత్రమైన సన్నిధియందే అనుభవించలేని మూర్ఖుడు యింక యేకాంతములో దేనిని అనుభవించగలడు? ఇది అసాధ్యము. కనుక యిలాంటి దివ్యసన్నిధియందే నేను అనుభవించాలని చిత్రకూటపర్వతాన్ని వదలిపెట్టి వచ్చాడు. నేను తెలివి తక్కువగా ఏకాంతవాసాన్ని చేయాలని భావించాను. ఎక్కడవుంది యీజగత్తులో ఏకాంతము. ఎక్కడ చూచినా నీవే వుంటున్నావు. ఏకాంతప్రదేశము నీవు చూపు ఎక్కడైనా? కనుక నీవున్న స్థానమే నాకు ప్రధానస్థానము. అయోధ్యను చేరుకున్నాడు. ఇక్కడ యింకొక విషయాన్ని మీరు చక్కగా గుర్తించాలి. మీరా కూడను యీ తులసి దాసు కాలములో వుండిన దేనని అనేకమంది చెప్పవచ్చును. ఇది సత్యము. ఒకనాడు మీరాను అనేకమంది బాధిస్తూ వచ్చారు. నిరంతరము భగవచ్చింతన చేసుకుంటూవుంటే మానవత్వము యొక్క కర్తవ్యాన్ని నీవు పూర్తి వదులుకుంటున్నావు. ఇది సరైనది కాదు. నీ ధర్మాన్ని నీవు ఆచరించాలని యనేకమంది మంచిగాను, చెడ్డగాను, కఠినముగాను బోధిస్తూ వచ్చారు. పెద్దల మాటలను పెడచెవిని పెట్టటము మూర్ఖత్వమని కూడను నిందించారు. తల్లితండ్రులే నీకు ప్రధానమైన ఆదర్శమూర్తులని కూడను బోధించారు. ఆమె సందిగ్ధావస్థలో మునిగిపోయింది. ఒకవైపున కృష్ణుడు, మరొకవైపున బంధువులు. బంధువుల నిమిత్తమై కృష్ణుని వదలుకోనటమా లేక కృష్ణుని నిమిత్తమై సర్వస్వాన్ని వదలుకోటమా అనే సందేహము యీమెను బాధిస్తూ వచ్చింది. మెల్లగా తులసి దాసు దగ్గరకు వచ్చింది. మహానుభావా! నేను యిలాంటి పరిస్థితిలో వుంటున్నాను. నాకు చక్కని జ్ఞానోదయము కల్గించి దేనిని వుంచమంటారు, దేనిని వదలమంటారు అని ప్రార్థించింది. కొన్ని నిముషములు ధ్యానములో నిమగ్నమైనాడు తులసి దాసు. రామా! దీనికి సరైన జవాబు నీవే నాద్వారా అందించమని కోరాడు. నేనొక లౌడ్‌స్పీకర్. నీవే మాట్లాడేవాడు. ఇదే పోతన కూడను 'పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుండట నేను పలికిన భవహరమగునట' అని తాను చెప్పుకున్నాడు.

తాను జవాబు చక్కగా సూటిగా చెప్పాడు. మీరా! ప్రాకృతికంగా తల్లితండ్రులు గురువులు అత్యవసరము. లౌకిక జగత్తు నిమిత్తమై తల్లితండ్రుల ఆజ్ఞను శిరసా వహించవలసినదే. వారికి కృతజ్ఞత నందించవలసినదే. కాని దైవమార్గమునకు

అడ్డు తగిలితేని తల్లియైనా సరే, తండ్రియైనా సరియే, గురువైనా సరియే త్యజించమని చెప్పాడు. ఎందుకంటె తల్లి, తండ్రి, గురువు కంటె కూడను దైవము గొప్పవాడు. దైవమునకు మించిన వారు మరొకరు లేరు. అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన నీటి బుడగకు వీరందరూ బాధ్యులు. పుట్టక మునుపు తల్లి తండ్రులెవరు? చచ్చిన తరువాత తల్లి తండ్రులెవరు. కాని దైవము పూర్వము వున్నాడు. మధ్యలో వున్నాడు. తరువాత వుంటున్నాడు. కాని ప్రాపంచిక సంబంధమైన విషయములలో తల్లి తండ్రుల ఆజ్ఞను నీవు శిరసా వహించి నడుచుకో. నీవును దైవానికి అడ్డు తగిలితేని వారిని త్యజించు, దైవాన్నే వరించు' అన్నాడు.

ప్రహ్లాదునకు, నారాయణునకు మధ్య తగిలిన హిరణ్యకశిపుని ప్రహ్లాదుడు త్యజించలేదా? త్యజించటం వల్ల వచ్చిన నష్టమేమి వచ్చింది ప్రహ్లాదునకు. రాములకు తనకు మధ్యనున్న కైక తల్లియైనప్పటికి, యనేక విధములుగా బోధించినప్పటికి భరతుడు తల్లి మాటను ధిక్కరించి రాములతో అరణ్యానికి చేరిపోయాడు. తల్లీ రాములకు నాకు మధ్యలో నీవు అడ్డము తగల వద్దు. రాముడే నాకు మొదటివాడు కాని కైక తల్లియైనప్పటికి నాకు ముఖ్యము కాదన్నాడు. బలి చక్రవర్తి వామనునకు దానమిచ్చే సమయములోపల గురువైన శుక్రాచార్యుడు అడ్డు తగిలాడు. గురువైనను త్యజించి బలి చక్రవర్తి వామనునకు దానము చేశాడు సర్వమును. ఇట్టివారికి గొప్ప కీర్తియే లభించింది కాని యేవిధమైన అపకీర్తి, యే విధమైన దుర్గతి వారందుకోలేదు. కనుక దైవమునకు యెవరైనా సరే అడ్డు తగిలితే వారిని శత్రువులుగా భావించమని చెప్పాడు తులసిదాసు. దైవాని పొందటానికి ఎవరు నీకు సహాయకారులౌతారో వారే సద్గురువులుగా భావించమని చెప్పాడు. దీనికి నేనే ఆదర్శమన్నాడు. దైవాన్ని బోధించి, దైవసన్నిధికే నీవు పొమ్మని, దైవాన్నే చింతించమని, యీ పాడు వ్యామోహాన్ని దైవము పైననే వుంచుకుంటే కించిత్తైనా బాగు పడతావని బోధించింది నా పత్ని. ఈమెనే నాకు సద్గురువు. ఇది నా అనుభవములో వుండిన ఆనందము. నిజముగా నా వ్యామోహమునకే ఆమె తోడు వుంటే నేను కూడను నరకములో వుండేవాడను. ఈ భవ బంధములలో మునిగి అనేక విధములైన దుఃఖములను అనుభవించే వాడను. ఈ విధమైన సుబోధలనంతా తులసిదాసు అనేకంగా బోధిస్తూ వచ్చాడు. అనేక మందికి సలహాలు యిస్తూ వచ్చాడు.

తులసి దాసు రామాయణము మహా పవిత్రమైనది. వాల్మీకి రామాయణము ఒకటి, తులసి రామాయణం ఒకటి, కంబ రామాయణం ఒకటి వీరు ముగ్గురు కూడను యీ రామాయణమునందు సరైన మార్గాన్నే చక్కగా అనుసరిస్తూ వచ్చారు. వీరు ముగ్గురు మూడు కాలముల వారైనప్పటికి వారి యొక్క రచన అంతా ఒక్కటిగానే చేకూరుస్తూ

వచ్చారు. తులసిదాసు రామాయణము పూర్తి హృదయస్థానమునుండి యేర్పడినది. దీనికి మధ్యమధ్య తనకు సందేహాలు కలిగినప్పుడు హనుమంతుని ప్రార్థించి, తన ద్వారా రాముని యొక్క రహస్యాన్ని తాను తెలుసుకోటానికి ప్రయత్నించేవాడు.

ఒకనాడు ఏదో ఒక సమస్య అధికంగా ఏర్పడింది. తన కవిత్వములో ఎన్నివిధములుగా ప్రార్థించినప్పటికి రాములను యీ సమస్యకు సరైన సమాధానము రాలేదు. పూజారి తలుపు తెరుస్తే కాని దేవుని యొక్క దర్శనము మనకు లభించదు. అదే విధముగనే యీ యొక్క హనుమంతుని ఆశ్రయిస్తేగాని రాముల యొక్క రహస్యము మనకర్థము కాదని గుర్తించుకున్నాడు. హనుమంతుడు చెప్పాడు నీగోడవంతా కూడను నాదగ్గర చెప్పుకోటానికి వీలుకాదు. ఆమె నిరంతరము అతని యింటనే, వెంటనే, జంటనే వుంటుంటాది కనుక ఆమెను ప్రార్థించమని చెప్పాడు. దీనినే రామదాసు కూడను చెప్పాడు. నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి నను బ్రోవమని చెప్పవే. అమ్మా నీవు వెంట వుంటుంటావు. అతను చక్కగా ఆనందముగా వుండే సమయాన్ని చూచి, నీతో చక్కగా మాట్లాడే సమయము చూచి, యేవిధమైన విచారము, కోపము లేని సమయాన్ని చూచి నా మాట అతని చెవిలో వెయ్యి అని చెప్పాడు. అదే విధముగనే యీ తులసి దాస్ కూడను సీతమ్మను ప్రార్థించాడు. అమ్మా నేను అతనిని సమీపించలేను. తమరే ఆయనను సమీపము ఎందుకనగా అతను రాముడు చంద్రుడు. నీవు వెన్నెల. చంద్రుని వదలి వెన్నెల, వెన్నెల వదలి చంద్రుడు వుండటానికి వీలుకాదు. కనుక నా విషయాన్ని ఒక్కతూరి అతని చెవిలో వేసి దీనికి సరైన జవాబు చెప్పమని ప్రార్థించాడు. చంద్రునికి ని కాంతికిని వున్న సంబంధమేమనగా అతను రామచంద్రుడు ఆమె శీతలమైన సీత. శీతల మనగా moon light. కనుక యీ యొక్క moon light ఆ moon కు యేవిధమైన అడ్డు తగలటానికి సాధ్యము లేదు. ఒకానొక సమయములో సీత కూడను చెప్పింది. అరణ్యమునకు రాముడు వెళ్లే సమయములోపల అమ్మా యీ కారడవులలో నీవు పడే యీ బాధలు నీవు సహించలేవని అనేకమంది బోధించినప్పటికిని అమ్మా చంద్రుడు ఒకచోట, వెన్నెల ఒకచోట వుండటానికి సాధ్యమవుతుందా, లేదు. చంద్రుని దగ్గరనే వెన్నెల వుంటుండాది. కనుక నేను రామచంద్రునితోనే వెళ్లుతాను అని చెప్పింది. ఎక్కడ రాముడో అక్కడే అయోధ్య. కనుక నేను అయోధ్యవాసమునే అనుభవిస్తాను అంది. ఈ విధముగా సర్వత్యాగము చేసినది కాబట్టి రాముడు కొంతవరకు సహించి దానికి సరైన రీతిలో జవాబు యివ్వవచ్చును. కనుక ఆనాటినుండి యీ ఆడవారి రికమెండేషను ప్రారంభమౌతూ వచ్చింది. కాని పవిత్రమైన మార్గమునకు, పరతత్వమును చూపించే మార్గమునకు వీరు ఆ రికమెండేషన్ చేస్తూ వచ్చారు. కాని యీనాటి పరిస్థితి యేమ

టే యీ ప్రమోషనులు, జీతాలు పెంచటానికి యీ రికమెండేషనులు భార్యలదగ్గరికి పోతుంటారు ఇది సరైనది కాదు. కారణమేమనగా ఆ రెండింటి యొక్క సన్నిహిత సంబంధ బాంధవ్యమును గుర్తించిన వ్యక్తులు ఆ మహానీయులు. ఈ రెండు వేరే. సతిపతులుగా వారు భావించలేదు. రెండు బింబప్రతిబింబములుగా భావిస్తూ వచ్చారు. తులసిదాసు ప్రత్యేకముగా బోధించిన విషయములోపల మూడింటిని యేకత్వముగా భావిస్తూ వచ్చాడు. అహం దేహాస్మి అనే సామాన్య మానవుని తో ప్రారంభమై, అహం జీవాస్మి అనే మధ్యమార్గములో నిలచి, అహం బ్రహ్మాస్మి అనే గమ్యమును చేరమన్నాడు. అది కూడను పరమ గమ్యము కాదు. ఎందుకనగా అక్కడకూడను ద్వైతముంటున్నాది. అహం బ్రహ్మాస్మి. అహం, బ్రహ్మ రెండు వుంటున్నాయి అక్కడ. అక్కడ అహం అహం అన్నారు. కనుక నేను, నేను అనే తత్వమే ఆత్మారామ తత్వము అన్నాడు. దీనినే రమ్యంతేతి రామః. రమింపచేసేదే రామచంద్రునియొక్క స్వరూపము అన్నాడు. కనుక తులసి దాసు తత్వము యీసంసారములో ప్రారంభమైందో దానితోనే తిరిగి మోక్షము కూడను లభించే మార్గాన్ని నిరూపింపచేశాడు.

దైవత్వమునకు భిన్నముగా మనము జీవించరాదని కూడను బోధించాడు. నీ స్వశక్తిపైన నీవు ఆధారపడటం మూర్ఖత్వము అన్నాడు. నీకట్టి అధికారము లేదు అన్నాడు. నీవు కేవలము మట్టి జడమే. నిజమైన చైతన్యము నీయందున్న ఆత్మతత్వమే. అట్టి చైతన్యమును దర్శించమన్నాడు. తులసిదాసుయొక్క విషయము కావలసినంత వుంటున్నాయి అయినప్పటికి అవసరమైన విషయాలను మాత్రమే మనము స్వీకరించి దివ్యమైన మార్గమును మనము అవలంబించి, పురుషత్వమును ప్రకటించి, దివ్యత్వమును వికసింపచేసి దైవత్వమును అనుభవించాలి అనే సత్యాన్ని గుర్తించి వర్తించటము అత్యవసరమని మీకు చెప్పుతు నా దీర్ఘ ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

ముఖ్యముగా దీనిలో వున్న సారాంశము మాటకు తగినట్లుగా మనము ప్రవర్తించినప్పుడే మానవుల మౌతాము. మాట భిన్నము మనప్రవర్తన వేరుగా వున్నప్పుడు మనము నిజముగా మానవులము కాము అనే సత్యాన్ని మీరు గుర్తించి మాటను తూచి అనుభవించటానికి ప్రయత్నించండి. వుపయోగించటానికి ప్రయత్నం చేయండి. చెప్పినవన్నీ ఆచరించటానికి సాధ్యము కాదు. అది నిజమే. కాని యే ఒకటిరెండైననూ జీవితములో ఆచరణలో పెట్టినప్పుడు మన జన్మ సార్థకమవుతుంది. ఈ కారణము చేతనే నేను మొట్టమొదట మాట్లాడనని ఒకవిధమైన మొండి వేశాను. మీరు మాటలను వృథా చేసుకోవచ్చును గాని నా మాటలు విలువైనవి. కనుక నేను వృథా చేసుకోటం నాకిష్టంలేదు. కాలమును వ్యర్థము చేయుటము యెవ్వరికిని మంచిది కాదు. సరైన ఋతువును బట్టి, సరైన భూమిలో

116028616

సరైన సమయములో విత్తనములు చల్లి వృధా చేసుకోటము యెంతకైతు కూడను ఇష్ట పడదు. హృదయక్షేత్రము పరిశుద్ధముగా వుంటుండాలి. వాక్కుబలము కూడను పరిపుష్టిగా వుంటుండాలి. ఇచ్ఛాశక్తి కూడను దీనికి సరైన తోడుగా వుంటుండాలి. ఈ మూడు లేని సమయములోపల యీ యొక్క విషయాన్ని మీరు యేమాత్రము స్వీకరించలేరు. దీనినే వేదాంత పరిభాషయందు ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అన్నారు. కనుక మీరు మాటను సక్రమముగా వుపయోగపెట్టుకొని, దానిని సద్వినియోగము చేసుకొని, దానిని సరైన రీతిగా మీరు అనుభవించినప్పుడు పవిత్రులౌతారు, ఉన్నతస్థాయిని అనుభవిస్తారు.

మరొకటి యిక్కడ అందరూ విద్యార్థులే చేరినారు కనుక అధ్యాపకులు కూడవుంటున్నారు కనుక మరొకటి కూడను నేను announce చేయాలనుకుంటున్నాను మా విద్యాసంస్థలు యే నిమిత్తమై యేర్పడినవనేది విద్యార్థులు గాని అధ్యాపకులు గాని గుర్తించాలి. ఇది కేవలము ఒక వ్యాపార రంగముగా మేము ప్రారంభించలేదు. ఇది ఒక వృత్తి క్రింద మేము యోచించలేదు. ప్రపంచము యొక్క భవిష్యత్తును ఆశించి, లోక కళ్యాణము హృదయమునందుంచుకొని, ఏ కొంతమందైన కూడను ఆదర్శవంతమైన విద్యార్థులు తేలుతారనే వుద్దేశ్యముతో యీ విద్యాసంస్థలు మేము ప్రారంభించాము. ప్రాచీన సంస్కారమును, ప్రాచీన సంస్కృతిని కూడను యీ విద్యార్థులు ప్రచురింప జేసి కొంత వరకును దేశమును సరైన మార్గములో తీర్చిదిద్దాలని మేము ఆశించాము. ఈనాడు విద్యాసంస్థలన్నీ కూడను అనేకరకములుగా యేదో ఒక విధమైన వృత్తుల క్రింద భావించి కొన్ని అపమార్గములను అనుభవిస్తూ వస్తున్నాయి. మీరు పేపర్లో చూస్తూ వుండవచ్చు. వచ్చే సంవత్సరమునుండి కూడను యీ విద్యాలయములందు వారి ట్యూషన్ ఫీజు, ఇంకా అనేక రకములైన ఫీజులుంటున్నాయి ఇవన్నీ డబుల్ చేస్తూ వస్తున్నారు. దీనిని ముందుగానే వారు సూచిస్తూ వస్తున్నారు. కాని మన సంస్థ యొక్క విషయము దీనికి విరుద్ధముగా వస్తుండాది.

మేము వచ్చే జూన్ నుండి కూడను యే యే ఫీజులుంటున్నాయో medical fees, games fees, lab fees, library fees, tution fees ఇవన్నీ తీసేస్తున్నాము. అంతా free education. ఇది యే ఆదాయము నిమిత్తమై మేము చేస్తున్నామని మీరు గుర్తించాలి. కేవలము విద్య అనేది ధనముతో గాని మరే విధమైన మార్గములో గాని ఇచ్చి పుచ్చుకొనే వ్యాపారము కాదు. సా విద్యా యే విముక్తయే. ఇది విద్య యొక్క సరైన ఇది. విముక్తి గావించేది విద్య. పవిత్రము గావించేది విద్య. మానవుని మానవునిగా తీర్చిదిద్దేది విద్య. దివ్యజీవనముచే మానవత్వమును వికసింపచేసేది విద్య. తన స్వశక్తిపైన తాను నిలువగలిగేటట్లు చేసేది విద్య. పవిత్రమైన ఆదర్శమున్నా

116028617

రక్తమునైననూ త్యాగము చేసే ఆదర్శమునందించేది విద్య. బలహీన భావములకంతా కూడను గ్లూకోజు విద్య. ఇంతియేకాదు. అధైర్యముతో, అశక్తతో కృంగిపోయే వానికి కేవలము వానికి పవిత్రమైన బలాన్ని ఇచ్చేది విద్య. దీనినే Calcium అంటారు. భగ అనిపిస్తుంది ఒక్కసారి. అంతేగాని యేదో బలహీనతతో నిశ్శక్తుని గావించుకోటము, నా జీవితము యేమవుతుందో అనే చింతనతో మునిగిపోయేది ఆవిధముగా చేసేది కాదు విద్య. చాలామంది విద్యనభ్యసించటము కేవలము ఉద్యోగాలకోసమని అనుకుంటున్నారు. ఈ begging bowl ఇచ్చేది కాదు విద్య. ఈ విధమైన విద్యను మనము ధనము యే మాత్రము వినియోగించరాదు అనే ఉద్దేశ్యముతో fees అంతా మాని వేస్తున్నాము. తద్వారా తల్లిదండ్రులకు కొంత శ్రమను తగ్గించిన వారమౌతాము. అంతేకాకుండా అనేకమంది శక్తిహీనులైన వారికి కూడను అవకాశమునందించిన వారమవుతాము. చాలామంది ధనములేక విద్యనభ్యసించనటువంటి వారు యెంతమందో వున్నారు. ఈ అవకాశమునందిస్తే అందరు కూడ యిక్కడ చేరటానికి అవకాశము వుంటుంది. మన University లోపల ధనవంతులు, ధనహీనులు అనే భేదము వుండకూడదు. బొంబాయి లోపల, మద్రాసు లోపల కొంతమంది చెప్పారు. కొంతమంది ధనమిచ్చి చదువుకునేవారు వుంటారుకదా వాళ్ళకు కొంత ఫీజు పెట్టి, ధనహీనులైన వాళ్ళకు free education ఇవ్వవచ్చుని కాని యీ భేదాభిప్రాయములు పెట్టినప్పుడు మాయొక్క సంస్థపూర్తి అడుగంటిపోతుంది. భేదమే వుండకూడదు అనే ఉద్దేశ్యముతోనే నేను అక్కడ కూడను announce చేశాను. ఏ భేదము వుండరాదు. అందరికి ఒకే భోజనము, అందరికి ఒకే education. అందరికి ఒకే శిక్షణ. అందరికి ఒకే భావము. ఇదే సర్వమత సమ్మతమే సాయి యొక్క అభిమతము. వాళ్ళను ఒక ప్రశ్న అడిగాను. Who is the poorest man in this world అని who is the richest man in the world అని. కొంతమంది అనేకరకాలుగా చెప్పారు. నేను చెప్పాను. He who has much satisfaction is the richest man. He who has much desires is the poorest man.

కనుక మీరు దీనిని ఒక వ్రతముగా భావించాలి. అందరు ఏకమత్యముగా వుంటుండాలి. ఏకమత్యమే మనకు నిజమైన బలము. ఇందులోపల యే విధమైన తారతమ్యములు లేకుండా, కేవలము విద్యయందు మాత్రమే మీ లక్ష్యము కాకుండా నైతికంగా, ధార్మికముగా, ఆధ్యాత్మికముగా మీ చిత్తములను వికసింప చేసుకోవాలి. అందరు త్యాగరాజులు కానక్కరలేదు. అందరు తులసిదాసులు కానక్కరలేదు. అందరు కబీరులు కానక్కరలేదు. ఏ కొంతమందైనా అందులో వారి భావములను మాత్రము

116028618

మీరు చిత్తమునందుంచుకొని సమయస్ఫూర్తిగా దానిని వినియోగించుకొని సార్థకము కావటము స్వామి యొక్క యిష్టము. మత భేదములు మీ యొక్క హృదయము నుండి తీసివేయుండి. అందరిది ఒక్కటే మానవ మతము. కాని మన యొక్క గమ్యము ఒక్కటే. దైవము ఒక్కటే యీ సత్యమును మీరు గుర్తించి వర్తించాలి. అందరు దైవము యొక్క బిడ్డలుగా మీరు భావించుకోవాలి. ఈ ఐకమత్యాన్ని మనము మన Institute నుంచి ప్రారంభము చెయ్యాలి ప్రచారమునకు. కేవలము యిక్కడ వుండినంత మాత్రమున యీ యొక్క దీనిని అనుసరించటము యీ వాతావరణము నుండి దూరమైన తక్షణమే విరుద్ధమైన మార్గమును అవలంబించటము యిది కేవలము దేశద్రోహమే కాకుండా ఆత్మద్రోహముగా దైవద్రోహముగా రూపొందుతుంది. ఎక్కడ పోయినా గాని shadow నీ వెంట వచ్చినట్లుగా యెక్కడ వుండినా కూడను యీ discipline యీ భావములు shadow మాదిరి వెంట రావాలి. ఆ విధముగా చేయకుండా మీ యిష్టానుసారము వర్తించుకుంటే యిది మీ ఖర్మలు. దానికి ఎవరేమి చేయగలరు. బుద్ధి కర్మానుసారిణీ. మీ కర్మలు మీరనుసరిస్తారు. కాని సాధ్యమైనంత వరకు కూడను ఆ విధముగా పెడమార్గము పట్టకుండా చూడటానికి తగిన కృషి చేయాలి. You must do.